05112024-MAI-04_Layout 1 11/5/2024 2:38 AM Page 1

దగాకోరు బటాచోరు
రజాకారు పోషకుడవు.
దిగిపొమ్మని జగత్తంత
నగారాలు కొడుతున్నది
దిగిపోవోయ్, తెగిపోనోయ్
- దాశరథి కృష్ణమాచార్యులు

నేడు దాశరథి వర్ధంతి

నమస్తే తెలంగాణ

సారు పాలనే భేష్

రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా రయ్యిరయ్యిమని ప్రగతి పథంలో పరుగులు తీయించిన కేసీఆర్ అంటే ప్రత్యర్థుల గుండెల్లో దడ. ఒకరు కేసీఆర్ గుర్తులు చెరిపేస్తానని శివాలు తొక్కుతుంటే మరొకరు ఎక్స్‌పైరీ డేట్ అని ఎగిరెగిరిపడుతున్నారు. ఎవరెన్ని చెప్పినా రాష్ట్ర సాధకుడిగా కేసీఆర్ కీర్తి, ప్రతిష్ఠలు చెరిపేస్తే చెరిగిపోయేవి కాదు. అవి నీటి మీది రాతలు కాదు, శిలాక్షరాలు. కేసీఆర్ పాలన సాధించిన అద్భుత విజయాలు కాంగ్రెస్ హామీలు, బీజేపీ తీర్మానాల తరహాలో నీటి మూటలు కావు, అద్వితీయ సువర్ణాక్షరాలు. ఇది నిన్న నిజం, నేడు నిజం, ఎన్నడూ నిజమే. అద్దం లాగే అంకెలు కూడా అబద్ధం చెప్పవు. ప్రజల అనుభవాలు భ్రమలు కావు. ఆర్థికవేత్తల విశ్లేషణలు, ప్రజల తలపోతల నిండా ఇప్పటికీ కేసీఆరే కనిపించడం యాదృచ్ఛికం ఏమీ కాదు. వెనుకబాటుతనం వారసత్వంగా పొందిన సరికొత్త రాష్ట్రాన్ని ఆదర్శంగా, అన్నపూర్ణగా తీర్చిదిద్దిన చరిత్ర కేసీఆర్‌ది.

అడ్డగోలు హామీలతో ప్రజలను మాయచేసి అధికారాన్ని కాంగ్రెస్ హస్తగతం చేసుకున్నది కానీ ప్రజలను మెప్పించలేక చతికిల పడుతున్నది. ప్రజలు కేసీఆర్ ప్రభుత్వమే ఉంటే ఎంత బాగుండునని పదే పదే యాది చేసుకుంటున్నారు. మరోవైపు నిపుణులూ కేసీఆర్ పాలనను తలచుకుంటున్నారు. అభివృద్ధి, సంక్షేమాలను సమతూకం చేస్తూ సాధించిన విజయ పరంపరపై నిన్నటి ప్రశంసలు, అవార్డులే కాదు నేటికీ వెల్లువెత్తుతున్న మెచ్చుకోళ్లు ప్రత్యర్థులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. కేసీఆర్ సారథ్యంలో దాదాపు పదేండ్ల పాటు తెలంగాణ అభివృద్ధిలో వేసిన అంగలను విశ్లేషకులు, నిపుణులు ఇప్పటికీ ప్రత్యేకంగా ప్రస్తావిస్తుండటం మనం చూస్తున్నాం. కేసీఆర్ హయాంలో ప్రగతికి చిరునామాగా తెలంగాణ మారిందని, దేశానికి ఓ నమూనాలా నిలిచిందని ఆర్థికవేత్త, ఫైనాన్స్ ప్లానర్ ముత్తుకృష్ణన్ తాజాగా కితాబివ్వడం విశేషం. ముఖ్యంగా వార్షిక వృద్ధి రేటు 8 శాతంగా ఉండటం, తలసరి ఆదాయంలో జాతీయ సగటుకన్నా యాభై శాతానికి పైగా అధికృత సాధించడాన్ని ఆయన ప్రస్తావించారు. మళ్లీ గెలిచి ఉంటే రాష్ట్రం నూతన శిఖరాలను అధిరోహించి ఉండేదని ముత్తుకృష్ణన్ పేర్కొనడం గమనార్హం. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిని కేస్ స్టడీగా తీసుకొని అధ్యయనం చేయాలన్నది ఆయన అభిప్రాయం. తన వ్యాఖ్యల ద్వారా ప్రస్తుత కాంగ్రెస్ పాలకుల పనితీరును ఆయన చెప్పకనే చెప్పారు.

నిజానికి కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే ఎక్కడెక్కడి నుంచో అధికారులు, ఆర్థికవేత్తలు ఇక్కడికి వచ్చి ఈ నమూనాను అధ్యయనం చేసి వెళ్లిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరింత లోతుగా అధ్యయనం జరగాలనడం ముదావహం. మరి తాము అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇంకా కేసీఆర్ పరిపాలన గురించే అబ్బురంగా చెప్పుకోవడం కాంగ్రెస్ పాలకులకు ఎందుకు నచ్చుతుంది? అందుకే ఆనవాళ్లు చెరిపేస్తామంటూ ఆకాశం మీదకు బాణాలు వేస్తున్నారు. అవి తిరిగి వచ్చి తమకే గుచ్చుకుంటే ఎగిరెగిరి పడుతున్నారు. కరెంటులో, కల్యాణలక్ష్మిలో, పింఛనులో, రైతుబంధులో, రుణమాఫీలో.. ఇలా అడుగడుగునా కేసీఆర్ సారే యాదికొస్తుంటే కల్లబొల్లి కాంగ్రెస్ నేతలకు చురుక్కుమని అనిపించడంలో వింతేముంది? కేసీఆర్ పరిపాలన ప్రాభవం దేశానికి ఓ పాఠం. అది కాంగ్రెస్ నేతలకు గుణపాఠమయ్యే రోజు ఎంతో దూరంలో లేదు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సంగ్రామంలో సామాజిక సమీకరణాలు కీలకంగా మారుతున్నాయి. బీజేపీ నేతృత్వంలోని 'మహాయుతి', కాంగ్రెస్ నాయకత్వంలోని 'మహా వికాస్ అఘూడీ (ఎంవీఏ)' కూటముల రాజకీయాలు కులాల చుట్టే తిరుగుతున్నాయి. ప్రత్యర్థి పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తున్న సామాజికవర్గానికి వ్యతిరేకంగా ఉండే ఇతర కులాల ఓట్ల సమీకరణపై పార్టీలు దృష్టి సారించాయి. రాష్ట్రంలో రాజకీయాలను శాసించే స్థాయిలో ఉన్న ఓబీసీ, మరాఠా సామాజిక వర్గాల కటాక్షం కోసం పార్టీలు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి.

సం'కుల' సమరమే!

ఐవీ మురళీకృష్ణ శర్మ

హర్యానాలో జాట్ సామాజిక వర్గం బీజేపీకి వ్యతిరేకంగా ఉండటంతో ఇటీవల జరిగిన ఆ రాష్ట్ర ఎన్నికల్లో కమలం పార్టీకి ఓటమి తప్పదని అందరూ భావించారు. కానీ, జాట్లకు వ్యతిరేకంగా ఓబీసీ సామాజికవర్గాన్ని ఏకం చేసిన బీజేపీ అనూహ్య విజయం సాధించింది. మహారాష్ట్ర ఎన్నికల్లోనూ ఇదే ఫార్ములాను బీజేపీ ప్రయోగిస్తున్నది. 30 శాతానికిపైగా ఉన్న మరాఠాలు మరాఠా రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేస్తూ ఉద్యమాన్ని తెరపైకి తీసుకురావడంతో రాష్ట్ర రాజకీయాల్లో పలు మార్పులు సంభవించాయి. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో రిజర్వేషన్లపై హామీ ఇచ్చిన బీజేపీ మాట తప్పడంతో ఆగ్రహించిన వారు 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమిని ఆదరించారు. దీంతో మరాఠాలకు ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలో 50 శాతానికిపైగా ఉన్న ఓబీసీ సామాజికవర్గం ఓట్లను గంపగుత్తగా దక్కించుకునేందుకు బీజేపీ విఫల యత్నం చేస్తున్నది.

రాష్ట్రంలో బీజేపీకి మొదటి నుంచి ఓబీసీల్లో ఆదరణ ఉన్నది. 'మాధవ్' ఫార్ములాతో ఓబీసీ సామాజికవర్గంలో అధికంగా ఉన్న మాలి, ధన్‌గర్, వంజరీ కులాల పై దృష్టిపెట్టిన బీజేపీ వారికి చేరువైంది. 2009 అసెంబ్లీ ఎన్నికల నుంచి 2024 పార్లమెంట్ వరకు ఓబీసీల ఓట్లను అత్యధికంగా దక్కించుకున్న బీజేపీ తన పట్టు ఇంకా సడలలేదని నిరూపించుకున్నది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లోనూ వారిపైనే భారీగా ఆశలు పెట్టుకున్నది.

2024 లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలోని 48 స్థానాలకు గానూ మహాయుతి కూటమి 17 స్థానాల్లోనే గెలిచిన నేపథ్యంలో, ప్రత్యేకించి కమలం పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తుగానే సన్నాహక చర్యలు ప్రారంభించినట్టు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్న 'పీపుల్స్ పల్స్' బృందం గ్రహించింది. అందులో భాగంగా 175కు పైగా నియోజకవర్గాల్లో పెద్దఎత్తున మైక్రో ఓబీసీ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను బీజేపీ చేపట్టింది. ఓబీసీలోని మరిన్ని కులాలకు చేరువయ్యేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అందులో భాగంగా ఏడు కొత్త కులాలను ఓబీసీ జాబితాలో చేర్చడమే కాకుండా, క్రీమీలేయర్ సీలింగ్‌ను రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచింది. దీంతో లోధా, బడా గుజ్జర్, సుర్యవంశీ గుజ్జర్, దన్‌గరీ, రేవ్ గుజ్జర్, మున్నూర్ కాపు, తెలంగి కులాలకు లబ్ధి చేకూరింది.

దీంతో రాష్ట్ర రాజకీయాలు మరాఠా వర్సెస్ ఓబీసీలుగా మారాయి. అందుకు 62 స్థానాలున్న విదర్భనే ఉదాహరణ. ఈ ప్రాంతంలో కుంభి, దళిత, ముస్లిం ఓటు బ్యాంక్‌పై ఎంవీఏ ఆశలు పెట్టుకోగా.. తేలి, బంజార, బోవిర్, కోమిటి, సానార్, గోండ్‌లతో పాటు 24 ఓబీసీ కులాల ఓట్లపై మహాయుతి భరోసాతో ఉన్నది.

అయితే, ఓబీసీల్లోని అన్ని కులాల ఓట్లు బీజేపీకే పడే అవకాశాలు శూన్యం. ఎస్టీ హోదా ఇస్తామన్న మాట తప్పడంతో ఓబీసీలోని ధన్‌గర్ కులం బీజేపీపై గుర్రుగా ఉన్నది. విదర్భ, మరాఠ్వాడా ప్రాంతాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉండవచ్చు. ఓబీసీల్లో కుంబీలు, హిందూయేతర సామాజికవర్గాలు బీజేపీకి సహకరిస్తాయా? అన్నది కూడా సందేహమే.

ప్రస్తుత పరిస్థితుల్లో మహారాష్ట్రలో మరాఠా, ఓబీసీ ఓట్లు ఒకే కూటమికి పడే అవకాశాలు చాలా తక్కువ. మరాఠా ఉద్యమంతో ఇతర కులాలు వారిపై గుర్రుగా ఉన్నాయి. మరోవైపు ఎస్టీలో చేర్చాలని ధన్‌గర్ సామాజికవర్గం డిమాండ్ చేస్తుండగా, ఆదివాసీలు వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఒకరి మద్దతు తీసుకుంటే మరో వర్గం దూరమవుతుందనే ఆందోళన అన్ని పార్టీల్లోనూ నెలకొన్నది.

హిందూత్వ ఓటుబ్యాంక్‌పై ఆశలు పెట్టుకున్న బీజేపీ బ్రాహ్మణులు, రాజ్‌పుత్‌లు, లింగాయత్‌లు, అగారీలను ఏకం చేస్తుండగా.. దళితులు, ముస్లింలు, గిరిజనులపై కాంగ్రెస్ ఆధారపడుతున్నది. దీంతో పాటు బీజేపీపై ఆగ్రహంగా ఉన్న ఓబీసీలోని కొన్ని వర్గాలను, మరాఠాలను తమకు అనుకూలంగా మలుచుకోవాలని ఎంవీఏ భావిస్తున్నది. ఈ నేపథ్యంలో నవంబర్ 20న జరుగనున్న ఎన్నికలపై ఆసక్తి నెలకొన్నది. ఈ 'మహా' సంగ్రామంలో సామాజికవర్గాలు, ప్రధానంగా మరాఠాలు, ఓబీసీలు ఎవరిని ఆదరిస్తాయన్నది నవంబర్ 23న వెలువడనున్న ఫలితాల్లో స్పష్టం కానున్నది.

(వ్యాసకర్త: రాజకీయ విశ్లేషకులు, పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ)

రాహుల్.. ఇన్నాళ్లూ ఎక్కడ దాక్కున్నారు?

అధికారం కోసం అడ్డగోలు హామీలిచ్చి, సబ్బండ వర్గాలను మోసం చేసినందుకు, అభివృద్ధి తెలంగాణను అవినీతి తెలంగాణగా మార్చినందుకు కాంగ్రెస్ పార్టీ తరపున యావత్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గారికి భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాసిన బహిరంగ లేఖ.

గౌరవనీయులైన రాహుల్‌గాంధీ గారికి..

పదేండ్లలో ఘనంగా అభివృద్ధి చెంది, పచ్చగా ఉన్న తెలంగాణ మీ ఏడాది పాలనలోనే ఏ విధంగా వందేండ్ల విధ్వంసానికి గురైందో మీ రాక సందర్భంగా ఒక్కసారి గుర్తుచేయదలచుకున్నాను. ఎన్నికలకు ముందు తెలంగాణలో ఏ పిల్లాడికి కష్టమొచ్చినా సరే ఇలా పిలుస్తే అలా వస్తానని చెప్పి తీరా గద్దెనెక్కిన తర్వాత మా ప్రజల గొంతును తడిగుడ్డతో కోశారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆటోడ్రైవర్లు, చేనేత కార్మికులు, మూసీ, హైడ్రా బాధితులు ఇలా ఒక్కరేమిటి సమాజంలో అన్ని వర్గాలను నయవంచనకు గురిచేశారు. ఒక్కటంటే ఒక్క మాట కూడా నిలబెట్టుకోకుండా ప్రజలను మోసం చేశారు. ప్రజలను హింసించే పులికేసి మాదిరిగా మీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాతనలు పెడుతుంటే మీరు ఏమీ తెలియనట్లుగా నటిస్తూ ఢిల్లీలో గప్‌చుప్ అయిపోయారు. అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే మీ నయవంచక స్వరూపం ఎలా ఉంటుందో ప్రజలకు రుచి చూపించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అంటూ ఊదరగొట్టిన మీరు మూడు వందల రోజులు దాటినా సరే వాటిని అమలుచేయటం చేతకాక చేతులెత్తేశారు. కాంగ్రెస్ కబంధ హస్తాల్లో చిక్కుకొని తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు విలవిలలాడుతోంది. అభయహస్తం అని నమ్మబలికి భస్మాసుర హస్తంతో తెలంగాణ ప్రజలను నిండా ముంచారు. ఒక్కటా, రెండా ఈ ఏడాది కాలంలో మీ పార్టీ పాలనా వైఫల్యాలు చిత్రగుప్తుడి చిట్టాను మించిపోయాయి.

నమ్మించి మోసం చేయటమనే నైజం కాంగ్రెస్ పార్టీ నరనరాల్లోనే ఉంది. ఆరు గ్యారెంటీలు, అభయహస్తం అంటూ ఇక్కడి ప్రజలను మోసం చేసేందుకు ముందుగా ఢిల్లీ నుంచి వచ్చి నాంది పలికింది మీరే. 'యథా రాజా తథా ప్రజా' అన్నట్టు ఆ తర్వాత మీ బాటలోనే ఇక్కడి నాయకులు నడుస్తున్నారు. 'ఆరు గ్యారెంటీల అమలు బాధ్యత నాది' అని చెప్పిన మీరు... అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటువైపు తొంగి కూడా చూడ లేదు. 300 రోజులైనా ఒక పరిమిత ఉచిత బస్సు మినహా ఒక్క గ్యారెంటీని అమలు చేయలేని అసమర్థత మీది. రైతులకు రుణమాఫీ అని చెప్పి సగం మందికి కూడా రుణాలు మాఫీ చేయలేదు. కానీ, మీ జాతీయ కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్‌లో మాత్రం పూర్తి రుణమాఫీ చేసేశామంటూ సిగ్గులేకుండా అబద్ధాలను ప్రచారం చేసుకున్నారు. ఒక్క రుణమాఫీయే కాదు, రైతుబంధును ఎగ్గొట్టారు. బోనస్‌ను బోగస్ చేశారు. కనీసం రైతులు పండించిన పంటను కూడా కొనుగోలు చేయలేని దద్దమ్మల మాదిరిగా తయారయ్యారు. నమ్మి ఓట్లు వేసినందుకు ఒక్క వర్గం కాదు, తెలంగాణలోని సబ్బండ వర్గాలను మోసం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్న మీ తీరును సమాజం గమనిస్తున్నది.

'అన్నివర్గాల సంక్షేమం మా బాధ్యత' అంటూ ఎన్నికలకు ముందు పెద్ద పెద్ద మాటలు చెప్పారు. కానీ, ఇప్పుడు అన్నివర్గాల సంక్షేమాన్ని నాశనం చేసే పనిని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ సాధించింది ఏంటంటే సబ్బండ వర్గాలను రోడ్డెక్కించటమే. నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, అంగన్వాడీలు, పోలీసులు ఇలా అన్ని వర్గాల వాళ్లు ప్రతిరోజు రోడ్లపై ధర్నాలు, నిరసనలు చేసే పరిస్థితికి తీసుకొచ్చారు. దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేనివిధంగా పోలీసులను పోలీసులతోనే కొట్టించిన ఘనత మీకే దక్కుతుంది. అన్నివర్గాల ప్రజలను మోసం చేయటమే క్షమించరాని తప్పంటే.. అది చాలదన్నట్లుగా గెలిపించిన ప్రజలను హింసిస్తున్నారు.

సాధారణంగా ప్రజల బాధలను తీర్చటం పాలకుల బాధ్యత. ప్రజలను బాధించటం ఎంత మాత్రం కాదు. కానీ, హింసించే పులికేసి మాదిరిగా మీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తయారయ్యారు. మూసీ, హైడ్రా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల పొట్ట కొడుతున్నాడు. హైడ్రా, మూసీ పేరు చెప్తేనే ప్రజలు హడలిపోయే పరిస్థితి తీసుకొచ్చారు. ప్రజలకు గూడు కట్టిస్తామంటూ నమ్మబలికి వాళ్ల గూడును చెదరగొట్టిన గొప్ప పాలన మీ ప్రభుత్వానిది. పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లను కూలగొడుతుంటే వాళ్ల ఆర్తనాదాలు మీకెందుకు వినబడలేదు. తెలంగాణలో చిన్నపిల్లాడు పిలిచినా వస్తానని బీరాలు పలికిన మీరు ఇన్నాళ్లు ఎక్కడ దాక్కున్నారు? స్వయంగా అశోక్‌నగర్‌కు వెళ్లి 'ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలకు నాది భరోసా' అని చెప్పి వారిని మోసం చేస్తున్నందుకు సిగ్గు అనిపించటం లేదా?

దమ్ముందా రాహుల్‌గాంధీ గారు మీకు.. అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల దగ్గరికి వెళ్లేందుకు? దమ్ముందా రాహుల్‌గాంధీ గారు రైతుల దగ్గరికి వెళ్లేందుకు? దమ్ముందా రాహుల్‌గాంధీ గారు విద్యార్థుల దగ్గరికి వెళ్లేందుకు? దమ్ముందా రాహుల్‌గాంధీ గారు మీకు రక్షణ కల్పిస్తున్న పోలీసుల దగ్గరికి వెళ్లేందుకు? దమ్ముందా రాహుల్‌గాంధీ గారు మూసీ, హైడ్రా బాధితులను పరామర్శించేందుకు? దమ్ముందా రాహుల్‌గాంధీ గారు ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల దగ్గరికి వెళ్లేందుకు? దమ్ముందా రాహుల్‌గాంధీ గారు ఆటో డ్రైవర్ల దగ్గరికి వెళ్లేందుకు? అసలు తెలంగాణ ప్రజల ముందుకు వచ్చే దమ్ముందా రాహుల్‌గాంధీ గారు మీకు?

మీ చేతగాని పాలన కారణంగా రాష్ట్రం ఆగమవుతోంది. మీ ఏడాది పాలనలోనే వందేండ్ల విధ్వంసం సృష్టించారు. ఇంకా నాలుగేండ్ల మీ చేతగాని పాలన కారణంగా తెలంగాణ ఏమైపోతుందోనని ఆవేదన కలుగుతున్నది. రైతులు, చేనేత కార్మికులు, ఆటోడ్రైవర్లు మీ పాలన మొదలు కాగానే ఆత్మహత్యలు చేసుకోవటం మొదలుపెట్టారు. ప్రతి వర్గాన్ని రోడ్డెక్కించారు. కంపెనీలు తరలిపోతున్నాయి. రాష్ట్ర ఆదాయం తగ్గిపోతోంది. పాలన అనుభవం లేని బ్లాక్‌మెయిలింగ్ ముఖ్యమంత్రి కారణంగా తెలంగాణ వందేండ్లు వెనక్కి వెళ్లే పరిస్థితి వచ్చింది. హైదరాబాద్‌లో నిరసనలు కూడా చేసేందుకు వీలు లేకుండా నెలరోజుల పాటు ఆంక్షలు పెట్టే దుస్థితి మీ ప్రభుత్వానిది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఏ మాత్రం అంచనా వేయకుండా నేల విడిచి మీరు చేసిన సాము కారణంగా తెలంగాణ భవిష్యత్తు తలకిందులుగా మారింది. తీరా చేయాల్సిన అన్యాయమంతా చేసి కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గారు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మించి హామీలు ఇస్తే ఆ రాష్ట్రం దివాళా తీస్తుందని స్వయంగా మీ పార్టీ అధ్యక్షుల వారే నొక్కి వక్కాణిస్తున్నారు. అధికారమే పరమావధిగా బొచ్చెడు హామీలు ఇచ్చిన పాపంలో మీరే ప్రధాన భాగస్వాములు. ఇప్పుడు అందుకు క్షమాపణలు చెప్తారా రాహుల్‌గాంధీ గారు.

దొరికిందే అవకాశమని మీ ముఖ్యమంత్రి, మంత్రులు తెలంగాణను అడ్డగోలుగా దోచుకునే కార్యక్రమం పెట్టుకున్నారు. ఎవరి ట్యాక్స్ వాళ్లకు కట్టే పరిస్థితి తెచ్చారు. మీ ముఖ్యమంత్రి గారు బహిరంగంగానే ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. కుంభకోణాలకు రాష్ట్రాన్ని కేరాఫ్ అడ్రస్‌గా మార్చేశారు. ఇది చాలదన్నట్టుగా కొడితే ఏనుగు కుంభస్థలం అన్నట్టు మూసీ ప్రాజెక్టు తెరపైకి తెచ్చారు. రూ.1.50 లక్షల కోట్లతో చేపడుతామంటున్న ఈ ప్రాజెక్ట్ ఎవరి ప్రయోజనాల కోసమో? ఈ మొత్తం సొమ్ములో ఢిల్లీ వాటా ఎంత? పేదల కడుపు కొట్టి వేల కోట్ల రూపాయలు జేబులో వేసుకొనే ఈ ప్రాజెక్ట్ మీ ఆమోదం లేకుండానే జరుగుతోందా?

మీ మోసం, నయవంచన ఒక్క ప్రజలతోనే ఆగిపోలేదు. మిమ్మల్ని మీరు కూడా మోసం చేసుకుంటున్న తీరు చూస్తుంటే మీపై సానుభూతి కలుగుతోంది. పార్టీ ఫిరాయింపులు చేస్తే తక్షణమే వేటు పడేలా చట్టం అంటూ తెలంగాణలో పోజులు కొట్టారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మీ ముఖ్యమంత్రి అడ్డగోలుగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతుంటే తేలు కుట్టిన దొంగలా సైలెంట్ అయిపోయారు. రాజ్యాంగాన్ని కాపాడుతానంటూ రాజ్యాంగ ప్రతులను పట్టుకొని తిరిగే మీరు తెలంగాణలో రాజ్యాంగ ఉల్లంఘనలు జరుగుతుంటే మౌనముని అయిపోయారు. అదానీ విషయంలో మీ హిపోక్రసీ చూసిన తర్వాత నవ్వాలో, ఏడ్వాలో తెలియని దుస్థితి. ఓ వైపు మోదీ, అదానీని కలిపి మోదానీ అంటారు. మరోవైపు తెలంగాణలో దోస్తానా చేస్తారు. సిగ్గు కూడా మిమ్మల్ని చూసి సిగ్గుపడే పరిస్థితి. మొత్తంగా ఏడాది కూడా తిరగకముందే కాంగ్రెస్ నాయకులు రోడ్లపై తిరగలేని దుస్థితి తీసుకొచ్చారు. మా తెలంగాణ ఆగమయ్యేందుకు ప్రధాన కారణం మీరే. కనుక సూటిగా మిమ్మల్నే ప్రశ్నిస్తున్నా. సమాధానం చెప్పండి. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సబ్బండ వర్గాలను మోసం చేసిన మీరు, అభివృద్ధి పథంలో ఉన్న తెలంగాణను అవినీతి తెలంగాణగా మార్చినందుకు యావత్తు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పండి.

ఇట్లు
కల్వకుంట్ల తారక రామారావు
భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే

నిజాయతీ లేని ఖర్గే మాటలు

టంకశాల అశోక్

కాంగ్రెస్ ఎన్నికల హామీల గురించి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలను విన్నప్పుడు, ఆయన ఎంత నిజాయితీగా మాట్లాడారో కదా అనిపించవచ్చు. కానీ, తనకు ఎంతమాత్రం నిజాయితీ లేదని రెండు విషయాలను గమనించినప్పుడు అర్థమవుతుంది. ఒకటి, సరిగా మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండగా కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అక్కడ మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని నిలిపివేసే అవకాశమున్నట్లు సూచించటంతో, ఆ ప్రభావం ఈ రెండు రాష్ట్రాలలో తామిచ్చిన హామీల విశ్వసనీయతపై ఎక్కడ ప్రభావం చూపగలదోనని ఆయన భయపడుతున్నారు. అంతే తప్ప, అబద్ధపు హామీలు ఇవ్వటం పట్ల యథాతథంగా అభ్యంతరమేమీ లేదు. రెండు, బడ్జెట్‌కు వీలుపడని హామీలివ్వటం సరికాదనే అభిప్రాయం ఆయనకు నిజంగానే ఉన్నట్లయితే, ఆ మాట హిమాచల్, కర్ణాటక, తెలంగాణ, హర్యానా ఎన్నికల సమయంలోనే గాక, ప్రస్తుత మహారాష్ట్ర, ఝార్ఖండ్ మ్యానిఫెస్టోల విషయంలోనూ అది ముందుగానే కన్పించేది. ఖర్గే నిజాయితీ లేని నాయకుడనటం అందువల్లనే.



ఆ విధంగా తప్పన్నది బడ్జెట్లకు అలవికాని హామీలు ఇవ్వటంలో లేదు. వాటిని ఉపయోగించుకొని అధికారానికి రావటంలో లేదు. అమలు చేయకుండా ప్రజలను మోసగించటంలో లేదు. ఒకవైపు మోసగిస్తూనే మరిన్ని అలవికాని అబద్ధపు హామీలు హర్యానాలో ఇవ్వటంలో లేదు. అక్కడ అవి పని చేయకున్నా మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో పని చేయవచ్చునని ఆశించటంలో లేదు. పోలింగుకు కొద్ది రోజుల ముందు శివకుమార్ అట్లా మాట్లాడటంలో మాత్రమే ఎక్కడ లేని తప్పంతా వచ్చిపడింది. ఇంతకు ముందటి అలవికాని హామీలు తమకు అధికారాన్ని తెచ్చిపెట్టినందున పార్టీ అధ్యక్షునికి ఎంతో సంతృప్తి కలిగింది. అటువంటి హామీల అమలు సాధ్యం కాదని ఎంతో అనుభవజ్ఞుడైన ఆయన అప్పుడే అర్థం చేసుకోలేదని నమ్మలేం. పైగా, సాధ్యం కాదన్న అంచనాలను ఆర్థిక నిపుణులు అప్పుడే వేసి హెచ్చరించారు కూడా. అయినప్పటికీ ఆయనగాని, తమ అధినేతలైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ గాని అటువంటి మోసాలు తగదని నివారించలేదు. పైగా అటువంటి మ్యానిఫెస్టోలను ఆశీర్వదించి, గ్యారెంటీ పత్రాలను బహిరంగ సభలలో స్వయంగా విడుదల చేసి, బాండ్ పేపర్లపై ఇంటింటికి పంపిణీ చేయించారు.

అదంతా ఎందుకు? ఏమి చేసైనా సరే అధికారానికి వచ్చి తీరాలన్న కోరిక తమను దహించివేస్తున్నది గనుక. పార్టీని రాజమార్గంలో నడిపి ప్రజల విశ్వాసాన్ని పొందే సమర్థత, నిజాయితీ తమకు ఎప్పటి నుంచో లేవు గనుక. ఇప్పటికీ ఆ లక్షణాలను తిరిగి సంపాదించలేదు గనుక. ఇప్పుడు హామీలు తిరగబడి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కల్లోలం చేస్తున్నట్లు ఖర్గే స్వరాష్ట్రమైన కర్ణాటకలో కొంతకాలం నుంచే అర్థమవుతున్నది. ఆ విషయమై స్వయంగా అక్కడి ప్రభుత్వ బాధ్యులే తరచూ మాట్లాడుతూ వస్తున్నారు. శివకుమార్ అన్నది ఆ క్రమంలో తాజాది మాత్రమే. తెలంగాణ పరిస్థితి కూడా అదే. అందరి మాటల సారాంశం ఒకటే. అలవికాని హామీలను అమలుపరచలేకపోతున్నాము. అందుకు తగిన నిధులు లేవు. ఈ ఖర్చుల వల్ల అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగటం లేదని. ఇదంతా ఢిల్లీలో అందరికీ తెలుసు. అయినప్పటికీ తోడుదొంగల వలె, లేదా తేలు కుట్టిన దొంగల వలె, ఇంతకాలం కిక్కురుమనలేదు. ఇప్పుడు ఝార్ఖండ్‌ను అట్లుంచినా మహారాష్ట్ర ప్రతిష్టాత్మకంగా మారింది. అక్కడి పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగా కనిపిస్తున్నాయి. అందుకే, హిమాచల్‌లో 10, కర్ణాటకలో 5, తెలంగాణలో 6 తరహాలో అక్కడ 5 గ్యారెంటీలు ప్రకటించారు. సరిగా ఆ దశలో శివకుమార్ మాటలు పిడుగు వలె వచ్చి పడ్డాయి. హిమాచల్, కర్ణాటక, తెలంగాణ హామీలు అమలు కావటం లేదన్న ప్రచారం హర్యానాలో ఓటర్లపై ప్రభావం చూపినందున, అదే ప్రచారం ఇప్పుడు మహారాష్ట్రను ప్రభావితం చేయగలదన్న జంకు ఖర్గేకు ఏర్పడినట్లు తన మాటలు స్పష్టంగా చెప్తున్నాయి. ఒకవేళ అక్కడి వారు నమ్మి మోసపోయేందుకు సిద్ధపడి తమను గెలిపిస్తే మాత్రం ఆయనకు ఎటువంటి ఆక్షేపణ ఉండదు. ఇవే మోసాలు మునుముందు ఇతర ఎన్నికలలో చేయగలమనే ధీమా లభిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే కాంగ్రెస్ అధ్యక్షునిది కేవలం వంచన.

కాంగ్రెస్ గ్యారెంటీల వంచనలు తెలంగాణ ప్రజలకు అర్థం కావటం ఇప్పటికే మొదలైనందున, ఇతర రాష్ట్రాలలో జరుగుతున్నదేమిటో వారికి ఇంకా బాగా అర్థం కాగలదు. ఇక్కడ అధికారానికి కాంగ్రెస్ వచ్చి కేవలం మరి రెండు రోజుల్లో (డిసెంబర్ 7) పదకొండు నెలలు పూర్తవుతాయి. ఏడాది అయ్యేందుకు ఒకే నెల మిగిలి ఉంటుంది.

కాంగ్రెస్ గ్యారెంటీల వంచనలు తెలంగాణ ప్రజలకు అర్థం కావటం ఇప్పటికే మొదలైనందున, ఇతర రాష్ట్రాలలో జరుగుతున్నదేమిటో వారికి ఇంకా బాగా అర్థం